క్లుప్తంగా

మాచర్ల తహసీల్దార్‌గా ఎండీ జియా ఉల్ హక్



మాచర్ల రూరల్: మాచర్ల మండల తహసీల్దార్‌గా మహమ్మద్ జియా ఉల్ హక్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు నుంచి ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన ప్రకాశం జిల్లా బదిలీపై వెళ్లి ఇక్కడకు వచ్చారు. గతంలో క్రోసూరు, పెదకూరపాడు మండలాల తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు డిప్యూటీ తహసీల్దార్లు జి.శ్రీనివాసరావు, షేక్ బాషా, ఆర్ఐ నిమ్మల శ్రీనివాసరావు, టైపిస్టు నాగవల్లి, సీనియర్ అసిస్టెంట్లు వై రంగారావు, ఎస్‌కే మస్తాన్‌వలి, వీఆర్‌వోలు భాస్కర్, ప్రశాంతి, నాగలక్ష్మి, జలీల్, నంద, రవి కుమార్, గోపాల్‌రెడ్డి, వెంకటరావు తదితరులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

తహసీల్దార్‌ను కలిసిన ఎంపీపీ



దాచేపల్లి : మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన వైపీ కుటుంబరావును ఎంపీపీ కందుల జాను మంగళవారం సన్మానించారు. ఇటీవల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కుటుంబరావును ఎంపీపీ జాను మర్యాద పూర్వకంగా ఆయన కార్యాలయంలో కలిసి రైతులకు సంబంధించిన సమస్యలపై చర్చించారు. రైతులు, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సత్వరమే పనులు చేయాలని ఎంపీపీ కోరారు. అనంతరం తహసీల్దార్ కుటుంబరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తండా అబ్దుల్‌సత్తార్, కందుల జానేష్ తదితరులున్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం

గురజాల : తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరమని దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజరు వై రత్నకుమారి సూచించారు. స్థానిక రజక కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అర గంటలోపు బిడ్డకు ముర్రుపాలు తాగించాలన్నారు. తల్లి పాలలో పోషక విలువలు అధికంగా ఉంటాయన్నారు. గర్భిణులు, బాలింతలు తల్లిపాల విశిష్టత గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, టీడీపీ నాయకులు కాశవరపు వెంకటేష్, మక్కెన శ్రీను, బండి శ్రీను, గర్భిణులు, బాలింతలు తదితరులు ఉన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం



రెంటచింతల: మండలంలోని మిట్టగుడిపాడు గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం రూ.38,500 విలువైన తెలంగాణ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎం.ఆంజనేయులు తెలిపారు. గురజాల మండలంలోని గొట్టిముక్కల గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మద్యాన్ని ద్విచక్రవాహనంపై రెంటచింతలకు తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మిట్టగుడిపాడు గ్రామం వద్ద తనిఖీ చేయగా ఒకరిని అదుపులోకి తీసుకుని అతని వద్ద 240 క్వార్టర్లను స్వాధీనం చేసుకోగా మరో వ్యక్తి పరారీ అయినట్లు తెలిపారు. గ్రామాలలో ఎవరైనా తెలంగాణ మద్యం విక్రయించినా, తరలించినా నేరమని అటువంటి వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు.

మల్లవరం మేజర్ కెనాల్‌కు మరమ్మతులు చేయించండి



మాచర్ల రూరల్: నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలోని జమ్మలమడక, మల్లవరం మేజర్ కెనాల్ మరమ్మతులు చేయించి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లను తొలగించాలంటూ జమ్మలమడక గ్రామ రైతులు కోరుతున్నారు. మంగళవారం మండలంలోని జమ్మలమడక, మల్లవరం మేజర్ కాలువ వద్ద వారు నిరసన వ్యక్తం చేస్తూ మాట్లాడారు. మేజర్ కాలువ రహదారిపై తుమ్మ చెట్లు విపరీతంగా పెరిగి వ్యవసాయ పనులకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని ఎద్దులు, ఆవులతో పాటు మనుషులూ వెళ్లలేని పరిస్థితి ఉందని, వెంటనే అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించాలని, అలాగే మల్లవరం మేజర్ కాలువ మరమ్మతులను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కోటబోయిన యలమంద, కామనబోయిన లింగయ్య, కామనబోయిన వెంకటేశ్వర్లు, తాడేబోయిన శివనాగరాజు, గోగుల శౌర్రాజు, వీర్ల సైదులు, పెద్ద లింగయ్య, నాగరాజు, మల్లిఖార్జునరావు ఉన్నారు.

పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికల సందడి

- రేపే నియోజకవర్గ వ్యాప్తంగా 209 పాఠశాలల్లో ఎన్నికలు
- ఎస్ఎంసీలపై కన్నేసిన కూటమి నేతలు
- రాజకీయాలకు అతీతంగా ఎన్నికలు జరగాలంటున్న తల్లిదండ్రులు
- గత ప్రభుత్వంలో ఈ కమిటీ ద్వారానే పాఠశాలల అభివృద్ధి



దాచేపల్లి పాఠశాలలో ఓటర్ల జాబితాను ప్రకటిస్తున్న హెచ్ఎం వట్టెపు నాగేశ్వరరావు



దాచేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్

దాచేపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల సందడి మొదలైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్కూల్ కమిటీల పేరుతో జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణ కోసం ఓటర్ల జాబితాను సంబంధిత విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. ఈ నెల 8వ తేదీన ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించేలా అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. గురజాల నియోజకవర్గ పరిధిలో 209 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిపేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. వీటిలో దాచేపల్లి 45, మాచవరం 39, పిడుగురాళ్ల 82, గురజాల 43 పాఠశాలలు ఉన్నాయి.

ఎన్నికల పరిశీలకులు వీరే...

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. మండల తహసీల్దార్, ఎంపీడీవో, వీఆర్‌వోలు ఎన్నికల పరిశీలకులుగా ఉంటారు. తల్లి, తండ్రి, పిల్లల సంరక్షకులుగా ఉన్న వారు ఓటర్లుగా ఉంటారు. సోమవారం ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలను అధికారులు పూర్తి చేశారు. ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంట లోపు సభ్యులతో పాటు చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు కమిటీ తొలి సమావేశం నిర్వహిస్తారు. పాఠశాల కమిటీలో ఉన్న ప్రతి సభ్యుడికి రెండేళ్ల పదవీకాలం ఉంటుంది.

దృష్టి సారించిన కూటమి నేతలు

కూటమి ప్రభుత్వం ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించింది. వారికి చెందిన వ్యక్తులనే చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నుకునేందుకు పావులు కదుపుతున్నారు. క్షేత్రస్థాయిలో పట్టు సాధించేందుకు కూటమి నేతలు ఎస్ఎంసీ ఎన్నికలపై ప్రధానంగా దృష్టి సారించారు. రాజకీయాలకు అతీతంగా ఎస్ఎంసీ ఎన్నికలు జరిగి అభివృద్ధికి నాంది పలికే వారిని కమిటీ సభ్యులుగా ఎన్నుకుంటే బాగుంటుందని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణలో రాజకీయ పార్టీల ప్రమేయం కూడా ఉండటంతో ప్రభుత్వ అధికారులకు తలనొప్పిగా మారుతుంది.

ఎస్ఎంసీలకు ఊపిరిపోసిన జగన్ ప్రభుత్వం

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఊపిరిపోసింది. గతంలో పేరుకే ఈ కమిటీలను ఎన్నుకుని పెత్తనమంతా అధికార పార్టీ నేతలు చలాయించేవారు. ఎస్ఎంసీ కమిటీ సభ్యులు పాత్ర నామమాత్రంగా ఉండటంతో పాఠశాలలు అభివృద్ధికి నోచుకోలేదు. గత ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్ఎంసీ కమిటీలకు పాఠశాల నిర్వహణ, అభివృద్ధిలో కీలక బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన నాడు–నేడు నిధులను ఈ కమిటీలకే అప్పగించారు. రాజకీయ ఒత్తిళ్లు లేకుండా చేయటంతో పాఠశాలలు అన్ని విధాలుగా అభివృద్ధి దిశగా పయనించాయి. ప్రతి నెల కమిటీ సమావేశాలు నిర్వహించి విద్యార్థుల పురోగతి, పాఠశాల అభివృద్ధిపై సమీక్షలు కూడా జరిగాయి.

ఎన్నికల నిర్వహణ ఇలా...

ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణ విధి విధానాలు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. పాఠశాల సెక్షన్లు, మీడియంతో సంబంధం లేకుండా తరగతిని యూనిట్‌గా తీసుకుని ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలి. వీరిలో తప్పనిసరిగా ఇద్దరు మహిళలు ఉండాలి. ముగ్గురిలో ఒకరు తప్పకుండా ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతులు, మరొకరు బీసీ, ఈబీసీ, మైనారిటీకి చెందిన వారై ఉండాలి. తరగతి నుంచి సభ్యుల ఎన్నికకు 50 శాతం ఓటర్ల హాజరును రిజిస్టర్‌లో చూపిన తరువాతనే ఎన్నిక జరపాల్సి ఉంటుంది. అదే విధంగా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కూడా 50 శాతం సభ్యుల హాజరు ఉండాలి. తరగతుల వారీగా ఎన్నికైన సభ్యులందరూ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులుగా ఉంటారు. ఈ సభ్యులందరూ కమిటీ వైస్ చైర్మన్, చైర్మన్‌ని ఎన్నుకుంటారు. ఒకవేళ తరగతిలో కనీసం ఆరు మంది విద్యార్థులు లేకపోతే మరో తరగతిలో విలీనం చేసి ఎన్నుకోవాలి.

ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిపిస్తాం



ఎస్ఎంసీ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిపిస్తాం. పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులనే కమిటీ సభ్యులుగా, చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. పాఠశాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసే ఈ కమిటీలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తాం. ఇప్పటికే పాఠశాలల్లో ఓటర్ల జాబితాలను ప్రచురించాం. 8వ తేదీన ఎస్ఎంసీ ఎన్నికలు జరిపి చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకుంటారు.

కూరగంటి కాంతారావు, ఎంఈవో, దాచేపల్లి

జీవో 117ను రద్దు చేయాలి

ఎస్టీయూ నాయకుల డిమాండ్



మాచర్ల రూరల్: ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం జీవో 117ను రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందారు బాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్టీయూ సభ్యత్వ నమోదును పురస్కరించుకొని కొప్పునూరు గ్రామ ఎంపీపీ పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తున్న జీవో 117ను రద్దు చేస్తామని ఎన్నికలలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, అలాగే పీఆర్‌సీ నూతన కమిటీని వేసి పెండింగ్ డీఏలను విడుదల చేయాలని కోరారు. ఐఆర్‌ను ప్రకటించి ఉద్యోగుల భవిష్యత్‌కు భరోసా కల్పించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానికి ఉందని, ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలవుతున్నా ఈ విషయాలపై స్పందించకపోవటం ఆందోళన కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ కన్వీనర్ అబ్దుల్ జబ్బార్, మాచర్ల మండల అధ్యక్షుడు ఎక్సమస్ జాన్, కార్యదర్శి టి.రాజశేఖర్, జిల్లా కౌన్సిలర్లు కృష్ణానాయక్, మధుసూదనరావు, సుభాని, శివ ప్రసాద్‌రాజు, షేక్ సిలార్ అహ్మద్ ఉన్నారు.

ఎన్నికలు సజావుగా జరపాలి

ఎంఈవో కె.కాంతరావు

గురజాల : నిబంధనలకు అనుగుణంగా ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించాలని ఎంఈవో–1 కె.కాంతరావు సూచించారు. స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎస్ఎంసీ ఎన్నికలకు సంబంధించిన మార్గదర్శకాలను ఇప్పటికే ప్రతి ఒక్కరికి అందించడం జరిగిందన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈ ఎన్నికలు పాఠశాలల అభివృద్ధికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో–2 ఎస్.సాంబశివరావు తదితరులున్నారు.

ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు అండగా ఉండాలి

సివిల్ జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్



మాట్లాడుతున్న సివిల్ జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్

మాచర్ల: ప్రతి ఒక్కరూ మానసికంగా పరిణతి లేని విద్యార్థుల విషయంలో జాగ్రత్త వహించి వారికి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకొని వారికి అండగా నిలబడాలని మాచర్ల కోర్టు సివిల్ జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ అన్నారు. శ్రీశైలం రోడ్డులో ఆయన అధ్యక్షతన న్యాయ అవగాహన సదస్సు సూర్య కిరణ్ ప్రత్యేక పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సమాజంలో ప్రత్యేక అవసరాలున్న, మానసిక పరిస్థితి సరిగా లేని వారికి తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారులతో మమేకమై ప్రతి ఒక్కరినీ పలకరించి సివిల్ జడ్జి వారికి అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుంజా ప్రసాద్, ఏజీపీ జీవీ, న్యాయవాదులు, నిర్వాహకులు ప్రకాష్ రాజ్ తదితరులున్నారు.

పురుగు మందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

పిడుగురాళ్ల: పట్టణంలోని పురుగు మందులు, విత్తనాల షాపులలో మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా షాపుల యజమానుల వద్ద సోర్స్ సర్టిఫికెట్ లేని స్టాక్ అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ స్టాక్ విలువ సుమారు రూ.92,200 ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్టుమెంట్ ఏవో కె.రమణకుమార్ మాట్లాడుతూ రైతులకు అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులందరు బిల్లులు కచ్చితంగా తీసుకోవాలని సూచించారు. బిల్లులు ఉంటేనే దుకాణ యజమానులపై చర్యలు తీసుకునే అధికారం ఉంటుందని తెలిపారు. అనంతరం పట్టణంలోని పలు దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల ఏవో ఎన్.శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్‌ను అందిద్దాం



సమీక్ష సమావేశంలో ఈఈ హరిబాబు

మాచర్ల: డివిజన్ పరిధిలో నిరంతర విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు ఏఈలు లైన్‌మెన్‌లతో చర్చించి విద్యుత్ సరఫరాకు సంబంధించి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా చూడాలని మాచర్ల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.హరిబాబు అన్నారు. మంగళవారం గురజాల, మాచర్ల నియోజకవర్గాలకు సంబంధించి 9 మండలాల విద్యుత్ శాఖ ఇంజనీర్లతో మాచర్ల కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా కురవటం వలన విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటం, పోల్స్ మరమ్మతులకు గురవుతాయనే విషయంలో ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ బిల్లుల బకాయిలు వసూలు చేయటంలో చర్యలు తీసుకోవాలన్నారు. కోట్ల రూపాయల బకాయిలుండటం కొంత ఇబ్బందికర వాతావరణమన్నారు. వినియోగదారుల నుంచి బిల్లులు వసూలు చేసే విషయంలో శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి మండలంలోనూ వ్యవసాయ, గృహ, ప్రభుత్వం మంజూరు చేసిన కాలనీలకు కనెక్షన్ల మంజూరుపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో ఆయా ఏడీఈలు, ఏఈలు, అధికారులు, ఏవోలు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారికి అప్పగింత



పిడుగురాళ్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు సెల్‌ఫోన్‌లను మంగళవారం పట్టణ సీఐ ఎస్.వెంకట్రావు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌ల దొంగతనానికి పాల్పడితే వారు వెంటనే ప్రత్యేక టెక్నాలజీ వలన దొరికిపోతారని, వారి జీవితాలు జైలు పాలవుతాయని హెచ్చరించారు. సెల్‌ఫోన్‌లు దొరికినట్లయితే స్వచ్ఛందంగా తీసుకొని వచ్చి పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని సీఐ సూచించారు. ఈ క్రమంలో ఫోన్‌లు పోగొట్టుకున్న నలుగురు వ్యక్తులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి రికవరీ చేసిన నాలుగు సెల్‌ఫోన్‌లను వారికి సీఐ అందజేశారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మిద్దె కూలి వృద్ధురాలికి గాయాలు



కారెంపూడి: మట్టి మిద్దె కూలి వృద్ధురాలు గాయపడిన ఘటన మండల కేంద్రమైన కారెంపూడిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కురిసిన భారీ వర్షానికి మట్టి మిద్దె నాని కూలిపోయింది. మిద్దె పైకప్పులో దూలం ఒకటి ఇంట్లో ఉన్న పలిశెట్టి వెంకమ్మ కాలుపై పడడంతో కాలుకు తీవ్ర గాయమైంది. అదృష్టవశాత్తూ మిద్దె కూలుతున్న శబ్దానికి ఆమె మేల్కొనటంతో ప్రాణాపాయం తప్పింది. ఘటనా స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

విత్తన శుద్ధితో రైతులకు ఎంతో మేలు

ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి



వరి నారు పెంపకంపై రైతులకు సూచనలు చేస్తున్న ఏవో బ్రహ్మారెడ్డి

రెంటచింతల: ఖరీఫ్ సీజన్‌లో వరి పంటను సాగుచేస్తున్న రైతులు విత్తన శుద్ధి చేయడం వలన ఎంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలలోని నారు మడులను ఆయన సందర్శించి రైతులకు వరి నారు పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి మాట్లాడారు. నారుమడి పోసుకునే ముందు విత్తన శుద్ధి చేయడం వలన అధిక దిగుబడులను సాధించడంతో పాటు అనేక ప్రయోజనాలను పొందవచ్చని తెలిపారు. వరిపంట సాగు చేస్తున్న రైతులు ఒక ఎకరం విస్తీర్ణంలో 20 నుంచి 25 కేజీల విత్తనాన్ని, హెచ్ఎంటీ రకాలు అయితే 10 కేజీల విత్తనాలు సరిపోతాయన్నారు. ఎకరాకు 5 సెంట్ల నారు మడిలో విత్తనం చల్లే ముందు ఒక కేజీ నత్రజని, ఒక కేజీ భాస్వరం వాడాలని సూచించారు. పది లీటర్ల నీటిలో 1.5 కిలోల ఉప్పును కలిపి ఎంపిక చేసుకున్న విత్తనాలను పోయగా నీటి అడుగున మునిగి ఉన్న గట్టి విత్తనాలను నారు పోసుకోవాలని సూచించారు. నారు మడిలో ఆకు తినే పురుగులు, ఉల్లికోడు, మొవ్వపురుగు సోకకుండా ఉండటానికి మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లే ముందు 0.2 శాతం క్లోరిప్రేరిఫాస్ ద్రావణంలో నానపెట్టి చల్లుకుంటే మేలు జరుగుతుందన్నారు. వరికి సంక్రమించే వివిధ తెగుళ్లు, చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వరిపంట చుట్టూ గట్టుపై కంది పంటను అంతర పంటగా సాగు చేయడం వలన రైతులకు అదనపు ఆదాయం వస్తుందని వివరించారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలి

ఎంపీడీవో జీఎల్ఎన్ గుప్తా



మాట్లాడుతున్న ఎంపీడీవో జీఎల్ఎన్ గుప్తా

దుర్గి: జిల్లా అధికారుల ఆదేశాల మేరకు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని ఎంపీడీవో జీఎల్ఎన్ గుప్తా కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి గ్రామ సచివాలయ ఇంజనీర్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్ 1 శానిటైజేషన్ డ్రైవ్‌లో మండలం వెనుకబడిందని, మెరుగుపర్చుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుత వర్షాకాలంలో ప్రత్యేక శ్రద్ధతో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలన్నారు. వర్షాలకు దోమలు వృద్ధి చెంది మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి రోగాలు ప్రబలే అవకాశాలున్నాయన్నారు. ప్రజలు పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. ఏవో శివప్రసాద్, ఆయా గ్రామ పంచాయతీ సెక్రటరీలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగ జాతి ఆణిముత్యం మందకృష్ణ మాదిగ



కేక్ తినిపించుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దుర్గి: మూడు దశాబ్దాలకు పైగా ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని విజయవంతంగా కొనసాగించి ఎస్సీ వర్గీకరణకు పోరాటాలు చేసిన గొప్ప నాయకుడు మందకృష్ణ మాదిగ అని దుర్గి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కందుకూరి రమేష్ మాదిగ కొనియాడారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మంగళవారం రాత్రి మండలంలోని కంచరగుంట గ్రామంలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యమ కాలంలో ఎందరో యువకులు బలిదానాలు చేశారని, ఇటువంటి ఘటనలు, త్యాగాలను స్మరించుకోవటం మన బాధ్యత అన్నారు. ఎస్సీల వర్గీకరణలో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబుల కృషి ఎంతగానో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి అమృతరావు, మాచర్ల అంకారావు, బీర్నీడి దానయ్య, కోటా బాబు, సురేష్, కోటా అభిషేక్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రారంభమైన వరి నాట్లు







మండలంలో వరి నాట్లు ప్రారంభం అయ్యాయి. బోర్ల కింద ముందస్తుగా వరి నారు పోసిన రైతులు వరి నాట్లు వేయిస్తున్నారు. దీంతో పొలాలన్నీ పచ్చదనం పరుచుకుంటున్నాయి. సాగర్ కాల్వకు 12 రోజుల క్రితం విడుదల చేసిన నీరు అలాగే కొనసాగుతుండడంతో రైతులంతా వరి నారు మళ్లు పోస్తున్నారు. ఈ వరి నాట్ల సీజన్ మరో నెలన్నర పాటు కొనసాగే సూచనలు కన్పిస్తున్నాయి. మండలంలో 16 వేల ఎకరాల వరకు మాగాణి భూమి ఉంది. ఈ నేపథ్యంలో ఇక్కడ నాట్లు వేసేందుకు కూలీలు సరిపోరని ఇతర ప్రాంతాల నుంచి రప్పించే యత్నాలు జరుగుతున్నాయి. మరో 15 రోజుల్లో వరి నాట్లు పూర్తి స్థాయిలో ఊపందుకునే పరిస్థితి కన్పిస్తోంది. గత ఏడాది కాల్వలకు నీరు లేక వరి మాగాణి భూములు ఖాళీగా ఉన్నాయి. ఆ భూములన్నీ నేడు సాగుకు అనుకూలంగా రైతులు మారుస్తున్నారు. పూర్తిగా బీడు పడిన పొలాలను సైతం కౌలు రైతులు బాగు చేయిస్తున్నారు. ఇదిలా ఉంటే వరి విత్తనాల కొరత కన్పిస్తోంది. రైతులు అడిగిన నాణ్యమైన వరి విత్తనాలు రైతులకు లభ్యం కాని పరిస్థితి నెలకొంది.

– కారెంపూడి

■ విద్యుత్ ఉద్యోగికి అభినందనలు

కారెంపూడి: ఇటీవల విడుదలైన నీట్ ఫలితాలలో ఆల్ ఇండియా 4,655 ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 141వ ర్యాంకు సాధించిన ఫిరోజ్ అహ్మద్‌కు విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు. ఫిరోజ్ తండ్రి అబ్దుల్ సలీమ్ కారెంపూడి సెక్షన్ ఆఫీస్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా, గురజాల సబ్ ఈఆర్‌వోగా పని చేస్తున్నారు.